క్లుప్తంగా

ఘనంగా సుబ్బాలమ్మ జాతర



సుబ్బాలమ్మకు పూజలు చేస్తున్న పండ్ల వర్తక సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణ పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో పట్టణ దేవత సుబ్బాలమ్మ జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించిన ఈ జాతరలో పండ్ల వర్తకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద వర్తక సంఘం ప్రతినిధులచే పులిహోర ప్రసాద వితరణ జరిగింది.

సివిల్ సప్లయిస్ జిల్లా కమిటీ మెంబర్‌గా గౌతమి



జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి

అల్లవరం: సివిల్ సప్లయిస్ జిల్లా కమిటీ మెంబర్‌గా అల్లవరం జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా సీఈఓ శ్రీరామచంద్రమూర్తి నుంచి ఉత్తర్వులు వచ్చాయని జెడ్పీటీసీ గౌతమి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు గౌతమి మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలకు అవకాశం లేకుండా ప్రజలకు పారదర్శకంగా సరకులు అందేలా కృషి చేస్తానని ఆమె తెలిపారు. జిల్లా సివిల్ సప్లయిస్ మెంబర్‌గా నియమితులైన గౌతమిని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, మాజీ ఎంపీ చింతా అనురాధ, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత

ముమ్మిడివరం: అరుదైన వ్యాధితో బాధపడుతున్న కర్రివానిరేవు గ్రామ పంచాయతీ పరిధి తోట్లపాలేనికి చెందిన ఆకుమర్తి నాగేంద్రప్రసాద్, శాంతకుమారి దంపతుల కుమార్తె జ్యోతికి ముమ్మిడివరం షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. సంఘం సభ్యులు మంగళవారం బాధితురాలి ఇంటికి వెళ్లి నగదును అందజేశారు. కార్యక్రమంలో మట్టా శ్రీనివాసరావు, జనిపెల్ల సత్యనారాయణ, కాశి వెంకటాచార్య, కటిక దల రాము, నక్కా శ్రీనివాస్, పాము ఆనంద రావు, బుడితి వెంకటేశ్వర్లు, కాశి బాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూమిని సర్వే చేయించాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో సావిత్రి నగర్‌లో ఎల్‌జీఆర్ పట్టాకు సంబంధించి భూమిని సర్వే చేయించాలని కోరుతూ మంగళవారం రేకాడి పార్వతి తదితరులు ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. 2004లో తన పేరు మీద ప్రభుత్వం పట్టా భూమిని ఇచ్చారని, అయితే సుమారు 10 మీటర్ల స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని పక్కా భవనాన్ని నిర్మించేశారంటూ ఆమె ఆర్‌ఏఓకు వివరించారు. అందుకే భూమి సర్వే చేయించి తనకు న్యాయం చేయాలని కోరారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక గ్రామంలో పుష్కర ఘాట్ పక్కన గల శివాలయం వద్ద మంగళవారం స్థానిక మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎస్ఎస్ పద్మావతి, కార్యదర్శి వై.అనంతలక్ష్మి, కోశాధికారి కె.విజయలక్ష్మి, శ్రీగిరి పద్మావతి, వై.రామతులసి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థులకే తల్లికి వందనం

అల్లవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే తల్లికి వందనం పథకాన్ని అమలుచేయాలని ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి కె.రత్నంరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు తల్లికి వందనం పథకం అమలు చేస్తే ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అవుతాయన్నారు. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే పథకం వర్తింపజేసేందుకు ప్రభుత్వం యోచించాలని రత్నంరాజు కోరారు.

రోడ్డు ఆధునీకరించాలి

ముమ్మిడివరం: నగర పంచాయతీ 19వ వార్డు దొమ్మేటివారిపాలెం రోడ్డును ఆధునీకరించాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. దొమ్మేటివారిపాలెం నుంచి క్రాప చింతలపూడిపాలెం, పల్లవారిపాలెం, ఎస్.మూలపాలెం, క్రాపపాలెం, ముక్తేశ్వరం గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ వెంకటరామిరెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు.

లంకవాసులకు గుండె కోత

- కోతకు గురవుతున్న లంక భూములు
- కుంగిపోతున్న గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు



కె.గంగవరం మండలం శేరిలంకలో కోతకు గురవుతున్న కొబ్బరి తోటలు

ముమ్మిడివరం: గోదావరి ఉగ్రరూపం దాల్చిన ప్రతీసారి లంకవాసులకు గుండెకోత తప్పడం లేదు. కొద్దిపాటి వరద వస్తే చాలు ఇల్లు, వేలాది ఎకరాల విలువైన లంక భూములు నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. కోత నివారణకు నిర్మించిన గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు కుంగిపోయి రక్షణ కల్పించలేక పోతున్నాయి. పలు పర్యాయాలు కేంద్ర బృందాలు నదీ కోతకు గురైన ప్రాంతాలలో పర్యటించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రూ.60 కోట్లతో కోత నివారణకు కమిని దీవి చుట్టూ రివిట్‌మెంట్ గ్రోయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. అనంతరం గత టీడీపీ ప్రభుత్వంలో ఆ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎదుర్లంక వద్ద రివిట్‌మెంట్ పనులకు రూ.42 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ప్రస్తుత కూటమి సర్కారు సదరు పనులకు ఆటంకాలు కలిగించకుండా కొనసాగిస్తే గోదావరి ఆటుపోట్ల నుంచి తమ భూములకు రక్షణ కవచం ఏర్పాటవుతుందని స్థానికులంటున్నారు.

వేల ఎకరాల భూమి కనుమరుగు

ముమ్మిడివరం, ఐ.పోలవరం, తాళ్లరేవు, కె.గంగవరం మండలాల పరిధిలో విస్తరించి ఉన్న కమిని దీవి ఎన్నో ఏళ్లుగా కోతకు గురవుతోంది. గౌతమి, వృద్ధ గౌతమి పాయల మధ్య ఉన్న ఈ దీవిలో కమిని, సలాదివారిపాలెం, శేరిలంక, వలపలతిప్ప, కొత్తలంక గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల భూములు నదీ కోతకు గురయ్యాయి. ఏటా వందలాది ఎకరాల కొబ్బరి, అరటి తోటలు గోదాట్లో కలిసిపోతున్నాయి. మూడు దశాబ్దాల కాలంగా వచ్చిన వరదల్లో రెండు వేల ఎకరాలకు పైగానే కోతకు గురైనట్లు రైతులు చెబుతున్నారు. గోదావరి వరదల్లో సలాదివారిపాలెంలో రామాలయం, ప్రభుత్వ పాఠశాల, గ్రామ కచేరీతో పాటు పురాతన కట్టడాలు కనుమరుగైపోయాయి. గోదావరి కోత భయంతో ఈ దీవిలో చాలా కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లిపోయారు. ఇక్కడే కాకుండా గౌతమి కుడి గట్టు (జీఆర్‌బీ) పరిధిలో అయినవిల్లి మండలంలోని పొట్టిలంక, వీరవల్లిపాలెం, పెదలంక, కొండుకుదురు లంక, కపిలేశ్వరరం మండలం అద్దంకి వారి లంకలో 700 ఎకరాల భూమి నదిలో నిమజ్జనం అయిపోయింది. ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠానేల్లంకలో 600 ఎకరాలు, ఐ.పోలవరం మండలం పశువుల్లంక, ఎదుర్లంక, కరువాకలంకల్లో 500 ఎకరాలు గోదావరిలో కలిసిపోయాయి. ఏటికేడు పెరుగుతున్న నదీ కోతను అరికట్టేందుకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు చేపట్టాలని స్థానికులు మొర పెట్టుకుంటున్నారు.

పరాయి పంచన తలదాచుకుంటున్నాను



సలాదివారిపాలెంలో నాకు మూడు సెంట్ల భూమిలో ఇల్లు ఉండేది. నదీ కోతకు గురై మా ఇల్లు గోదావరిలో కలిసిపోయింది. రివిట్‌మెంట్ లేక నాకున్న కొద్ది పొలం కూడా కోతకు గురవుతుంది. బతుకుదెరువు కోసం గ్రామం వదలి వేరే గ్రామంలో తల దాచుకుంటున్నాను.

– సలాది సూర్యనారాయణ, సలాదివారిపాలెం, ముమ్మిడివరం మండలం

జీవనాధారం కోల్పోతున్నాం



ఏటా వరదలకు వృద్ధ గౌతమీ పాయ వెంబడి భూమి కోతకు గురవుతుంది. ఇప్పటికే వేలాది ఎకరాలు భూమి కోతకు గురైంది. విలువైన భూములు నదీ గర్భంలో కలిసిపోతుంటే జీవనాధారం కోల్పోతున్నాం. అధికారులు వెంటనే గోదావరి నదికి రివిట్‌మెంట్, గ్రోయిన్లు ఏర్పాటు చేయాలి.

– ఎస్.వెంకటేశ్వరరావు, సలాదివారిపాలెం, ముమ్మిడివరం మండలం

రెడ్డిపల్లిలో ప్రబలిన విష జ్వరాలు



రెడ్డిపల్లిలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావుదొర

అమలాపురం రూరల్: మండలంలో రెడ్డిపల్లి గ్రామంలో పలువురు విష జ్వరాల బారిన పడ్డారు. ప్రధానంగా డెంగీ లక్షణాలతో ఎక్కువ మంది బాధపడుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర, అడిషనల్ డీఎంహెచ్‌ఓ భరతలక్ష్మి, ఎంపీడీవో మల్లిఖార్జునరావు, సర్పంచ్ కరాటం ప్రసన్నలు మంగళవారం గ్రామంలో పర్యటించి స్థానిక అధికారులు, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. డెంగీ లక్షణాలతో బాధపడుతున్న రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరా తీశారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలని గ్రామ పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డీఎల్‌పీఓ బొజ్జిరాజు గ్రామంలో శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గ్రామంలో పర్యటించి డెంగీ బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఎస్పీ శ్రీధర్‌కు ఘనంగా వీడ్కోలు



ఎస్పీ శ్రీధర్‌ను సత్కరిస్తున్న పోలీస్ అధికారులు

అమలాపురం రూరల్: జిల్లా నుంచి బదిలీపై వెళుతున్న ఎస్పీ ఎస్.శ్రీధర్‌కు పోలీస్ అధికారులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో పోలీస్ సిబ్బంది పెరేడ్ నిర్వహించి గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ శ్రీధర్‌ను పోలీసు ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ అమలాపురం డీఎస్పీగా, జిల్లా ఎస్పీగా పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అందరి సహకారంతో సార్వత్రిక ఎన్నికలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఖాదర్ బాషా, డీఎస్పీ ఉమామహేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ విజయ సారథి, సీఐలు క్రిస్టోఫర్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

200 అక్రమ కుళాయిల గుర్తింపు

- వారం రోజుల్లో క్రమబద్ధీకరించుకోకపోతే కనెక్షన్లు కట్
- మున్సిపల్ కమిషనర్ మనోహర్ హెచ్చరిక



మున్సిపల్ సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్న కమిషనర్ మనోహర్

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో ఇటీవల నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ తనిఖీల్లో 200 అక్రమ తాగునీటి కుళాయిలను గుర్తించామని కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్, పారిశుధ్యం, తాగునీటి సరఫరా తదితర విభాగాల అధికారులు, వార్డు సచివాలయాల కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కమిషనర్ మనోహర్ మాట్లాడారు. అక్రమ కుళాయిలకు సంబంధించి ఇప్పటికే 70 మంది తమ అక్రమ కుళాయిలను రెగ్యులర్ చేసుకున్నారన్నారు. మిగిలిన కుళాయిలను కూడా వారం రోజుల్లో రెగ్యులర్ చేయించుకోవాలని, లేని పక్షంలో వాటి కనెక్షన్లను పూర్తిగా నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. హోటళ్లు, లాడ్జీల్లో ప్రతి యాజమాని వాటర్ మీటరు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఇలా మీటర్లు ఉన్న యాజమానులు ప్రతి నెలా వాటర్ బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్నారా...లేదా..? అసలు మీటర్లు పనిచేస్తున్నాయా లేదా..? చెడిపోయిన మీటర్లను యాజమానులు సకాలంలో బాగు చేయించుకుంటున్నారా..? అన్నది వాటర్ వర్క్ సిబ్బంది తనిఖీలు చేసి సంబంధిత యాజమానులకు నోటీసులు ఇవ్వాలని కమిషనర్ మనోహర్ ఆదేశించారు. పట్టణంలో ఎక్కడైనా తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఉంటే తక్షణమే వాటిని గుర్తించి లీకేజీలను అరికట్టాలని సూచించారు. పట్టణంలో పబ్లిక్ కుళాయిలు ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటికి ఎంతవరకూ రిపేర్లు అవసరం, ఎన్ని పని చేయడం లేదు వంటి వివరాల సేకరణలో సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముందు తాగునీటి పైపులైన్ల లీకేజీలు లేకుండా ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించినప్పుడే పట్టణంలో డయేరియా, సీజనల్ వ్యాధులను పూర్తి స్థాయిలో అరికట్టవచ్చని స్పష్టం చేశారు. అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ సిబ్బందికి సూచించారు. సమావేశంలో మున్సిపల్ డీఈఈ నాగ సతీష్, అసిస్టెంట్ ఇంజినీర్లు సూర్య భాస్కరరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి



కలెక్టర్ మహేష్‌కుమార్‌తో మాట్లాడుతున్న కోనసీమ జేఏసీ నాయకులు

అమలాపురం రూరల్: కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణంలో రైల్వే ట్రాక్ ఏర్పాటు కోసం భట్నవిల్లి నుంచి దిండి వరకూ చేయాల్సిన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ను కోనసీమ జేఏసీ కార్యవర్గ సభ్యులు కోరారు. మంగళవారం కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహన్‌రావు, కోకన్వీనర్ ఇళ్ల భక్తవత్సలం, ఎం.వేణుగోపాల్, రాయుడు శ్రీరామచంద్రమూర్తి తదితరులు కలెక్టర్, రెవెన్యూ అధికారులను కలిసి భూసేకరణ నత్తనడకన సాగుతున్న విషయాన్ని వివరించారు. దీనిపై కలెక్టర్ మహేష్‌కుమార్ స్పందిస్తూ ఈ అంశం ఇప్పటికే తన దృష్టిలో వుందని భూసేకరణ వేగంగా జరగడానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భూసేకరణ నెమ్మదిగా జరుగుతున్న మాట వాస్తవమే గాని పూర్తిగా ఆగలేదని రెవెన్యూ అధికారులు బదులిచ్చారు. భట్నవిల్లి–దిండి మధ్య అక్కడక్కడ భూసేకరణ జరిగిందని, ఆ భూమిని రైల్వేశాఖకు అప్పజెప్పామన్నారు. కొన్నిచోట్ల స్థానికులు సహకరించడం లేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు అన్యం రాంబాబు, మధుర నరసింహమూర్తి, రుద్రరాజు సూరపురాజు, రంకిరెడ్డి కాశీ, రామకృష్ణ భాగవతుల మూర్తి, ఎస్.శాంసన్, నంద్యాల నాయుడు, పమ్మి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న మెట్టకూరు గ్రామపెద్దలు

యానాం: ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్థాపించిన స్వచ్ఛంద సంస్థ స్వచ్ఛ సేవా సమితి ద్వారా సమకూర్చిన నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగులను స్థానిక మెట్టకూరు ఆదిఆంధ్రపేటలో 25 మంది విద్యార్థులకు గ్రామ పెద్దలు పంపిణీ చేశారు. నిరుపేద విద్యార్థులను తన స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆదుకుంటానని ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే అశోక్ సేవా కార్యక్రమాలు చేస్తుండడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు ఎమ్మెల్యే అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వెంకన్నకు నేడు తొలి ఏకాదశి పూజలు



యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి

యానాం: తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు పెద్దింటి రఘురామ వినోదాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి బుధవారం ఉదయం పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, పుష్పార్చన నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ లలిత మహిళా మండలి సభ్యులచే విష్ణు సహస్ర నామ పారాయణ జరుగుతుందన్నారు.

అనధికార ఆక్వా చెరువులపై చర్యలు తీసుకోండి



వ్యవసాయాధికారి కుమార్‌బాబుకు సమస్యలను వివరిస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధిలో అనధికారకంగా తవ్వుతున్న ఆక్వా చెరువులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ మల్లికార్జునరావు, వ్యవసాయాధికారి కుమార్‌బాబులకు గంధంవారిపాలెం, మంచెంవారిపాలెం గ్రామస్తులు మంగళవారం వినతిపత్రాలు అందించారు. చెరువులతో వ్యవసాయ భూములు, భూగర్భజలాలు కలుషితమై పరిసర ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గంధం వెంకన్న, సూర్యనారాయణ, మంచెం బుజ్జి, చవ్వాకుల దుర్గారావు తదితరులు ఫిర్యాదు చేసినవారిలో ఉన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

యానాం: పుదుచ్చేరిలోని యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌కు మొహర్రంను పురస్కరించుకుని బుధవారం సెలవు ప్రకటిస్తూ డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటించిందని విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలకు శుద్ధమైన మంచినీరు అందించాలి



ఓడల రేవు గ్రామంలో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణమోహన్

అల్లవరం: ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలని ఎంపీడీవో కృష్ణమోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఓడలరేవులో పర్యటించిన ఆయన మంచినీటి సంపు, ఓహెచ్ఆర్‌లను పరిశీలించారు. కుళాయిల నుంచి రోజూ మురుగునీరు వస్తుందని, మూడు రోజులుగా మంచినీళ్లు రాలేదంటూ గ్రామస్తులు ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ స్వామికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో సంపు, ఓహెచ్ఆర్‌లలో పేరుకుపోయిన బురదను తొలగించాలని ఆదేశించారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు మోటార్ సహాయంతో సంపులో పేరుకుపోయిన బురదను పంచాయతీ సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో మల్లాడి ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచ్ కొల్లు విష్ణుమూర్తి, తారాడి ఉమామహేశ్వరరావు, అంకాని మోహన్, కొల్లు త్రిమూర్తులు, కామాడి గంగాభవాని, కోలా అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్‌లకు ఎల్‌డీసీలుగా పదోన్నతి

యానాం: మల్టీ టాస్కింగ్ సిబ్బంది(ఎంటీఎస్)కి ఎల్‌డీసీలుగా పదోన్నతి కల్పించేందుకు సంబంధిత సీనియారిటీ జాబితాను డీపీఏఆర్ కార్యదర్శి వి.జయశంకర్ మంగళవారం విడుదల చేశారు. యానాం నుంచి షయ్యద్ రషీదా, నామా సీత, అదాడి ఈశ్వరమ్మ, లంకా శ్రీనివాస్, బత్రు కృష్ణమూర్తి, మల్లాడి వీరవేణి, సీహెచ్ లక్ష్మీకుమారి, ఊబలంక సూర్యనారాయణ, సీహెచ్ నర్సింహమూర్తి, పొన్నాడ త్రినాథబాబు, పాముకృష్ణారావు, సయ్యద్ నూర్ అహ్మద్ అలీ సీనియారిటీ జాబితాలో ఉన్నారు. వీరంతా ఎల్‌డీసీలుగా పదోన్నతి పొందే అవకాశముంది.

నెలాఖరులో బడ్జెట్ సమర్పణ

యానాం: 2024–25 పూర్తి స్థాయి పుదుచ్చేరి బడ్జెట్‌ను ఈ నెలాఖరులోగా అసెంబ్లీలో సమర్పిస్తారని ఎల్జీ రాధాకృష్ణన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒకటి, రెండు రోజుల్లో డ్రాఫ్ట్ బడ్జెట్‌ను కేంద్ర హోం శాఖ ఆమోదించే అవకాశాలున్నాయని భావిస్తున్నానన్నారు. అనంతరం అసెంబ్లీలో ఆమోదించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా ఇటీవల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తిరుమురుగన్‌కు పోర్ట్‌పోలియో కేటాయించకపోవడంపై అడిగిన ప్రశ్నకు రాజ్‌నివాస్‌కు సంబంధిత ఫైలు రాలేదని జవాబిచ్చారు.

విద్యను ప్రోత్సహించడం అభినందనీయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న వైద్యాధికారులు

రాజోలు: నిరుపేద విద్యార్థులు ఆర్థిక సమస్యలతో విద్యను నిలిపివేయకుండా ప్రోత్సాహం అందిస్తున్న సేవ్ ది పీపుల్ సంస్థ సేవలు అభినందనీయమని తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ఫణి కుమార్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో పొదలాడ గ్రామానికి చెందిన జి.మేఘనకు రూ.10 వేల చెక్‌ను వైద్యులు ఫణికుమార్, మానస సుప్రియ అందజేశారు. వారు మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకులు సుంకర సుధీర్ సేవలను కొనియాడారు. తెలివైన విద్యార్థులు కేవలం ఆర్థిక సమస్యలతో ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని అటువంటి వారిని గుర్తించి ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులను అభినందించారు. సీహెచ్‌ఓ ఎం.ఎలిజబెత్, పీహెచ్‌ఎన్ ఎ.సత్యవతి, హెచ్‌వీ బి.జయకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ మద్దాల శ్రీనివాసరావు, ఫార్మసిస్ట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.